నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, ఆదివారం 9 ఫిబ్రవరి 2025 VIKARABAD



హైదరాబాద్ బీఆర్ఎస్ భవన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# వికారాబాద్ జడ్పీపై గులాబీ జెండా ఎగరేద్దాం..

- స్థానిక సంస్థల ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గంలోని ఆరింటికి ఆరు మండలాల్లో గెలిచి కాంగ్రెస్‌పై వ్యతిరేకత ఎంత ఉన్నదో తెలిసేలా చేద్దాం
- సామాజిక సమీకరణాలతోపాటు గెలిచే వారినే అభ్యర్థులుగా నిలబెడుదాం
- వర్గపోరు ఇకపై వద్దు.. ఐకమత్యంగా పని చేయండి
- 4-5 దశాబ్దాల కల అయిన వికారాబాద్ జిల్లాను కేసీఆర్ నెరవేర్చారు
- డిగ్రీ కాలేజీ లేని పరిస్థితుల్లో మెడికల్, నర్సింగ్ కాలేజీలను మంజూరు చేశాం
- వికారాబాద్ ప్రజలు విశ్వాసం ఉన్నోళ్లు కాబట్టి రెండు సార్లు గెలిపించారు
- వికారాబాద్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వికారాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గంలోని ఆరు జడ్పీటీసీలు, ఆరు ఎంపీ పీలను గెలిపించి జిల్లా పరిషత్‌పై గులాబీ జెండా ఎగురవేసేలా ఐకమత్యంగా పని చేయాలని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. శని వారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ భవన్‌లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇం ద్రారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి నిర్వహించిన వికారాబాద్ నియోజకవర్గ కార్యకర్తల సమావే శంలో ఆయన మాట్లాడారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో స్పీకర్ నియోజకవర్గం లోనే ఆరింటికి ఆరు గెలిచి కాంగ్రెస్‌పై ఎంత వ్యతిరే కత ఉన్నదో తెలిసేలా చేద్దామని పిలుపునిచ్చారు. ఎన్నికలన్నప్పుడు మండలంలో పది మంది బరా బర్ టికెట్ అడుగుతారని కానీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ తదితర సామాజిక సమీకరణాలు చూసు కొని, గెలిచే వారినే బరిలో దింపాలని, ఎవరు బరిలో ఉన్నా కలిసికట్టుగా పని చేయాలన్నారు. పార్టీకి దూరంగా ఉన్న వారిని దగ్గరికి తీసుకోవా లని, మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌పై కోపతాపాలుంటే తీసేయాలని, ఇకపై వర్గపోరు లేకుండా సమన్వ యంతో ముందుకెళ్లాలని కేటీఆర్ సూచించారు.

## జిల్లా ఏర్పాటు కలను నెరవేర్చిన కేసీఆర్..

4-5 దశాబ్దాల కల అయిన వికారాబాద్ జిల్లా ఏర్పాటు డిమాండ్‌ను ఇంద్రారెడ్డి ఉన్నప్పటి నుంచి వింటున్నామని, జిల్లా ఏర్పాటు కలను మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ నెరవేర్చారని కేటీ ఆర్ తెలిపారు. హైదరాబాద్‌కు పక్కనే ఉన్న వికారాబాద్‌లో ఒక్క మెడికల్ కాలేజీ లేని పరిస్థితి ఉండేది, కనీసం డిగ్రీ కాలేజీ వస్తదో, రాదో అనుకున్న పరిస్థి తుల్లో మెడికల్ కాలేజీతో నర్సింగ్ కాలేజీలను మంజూరు చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. అనం తగిరి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సి ఉండేది కానీ ఏ కారణం చేతనో చేయలేకపోయామని, తప్పకుండా చేసుకుందామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తి పోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యా యని, రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌ల నిర్మాణం పూర్తైందని, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరిచ్చే పనులు కొంత ఆలస్యమైన మాట వాస్తవమని, మళ్లీ బీఆర్ఎస్ పార్టీతోనే వికారా బాద్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరందిస్తామని కేటీఆర్ మాటిచ్చారు. రియల్ ఎస్టేట్ రంగం వికా రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌లోనే కాదు మా సిరిసి ల్లలో కూడా కుప్పకూలిందని, రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్‌పై ఆధారపడినవారి పొట్టకొట్టారన్నారు.

## వికారాబాద్ ప్రజలు విశ్వాసమున్నోళ్లు..

వికారాబాద్ ప్రజలు విశ్వాసం ఉన్నవారు కాబట్టి 2014, 2018 ఎన్నికల్లో గెలిపించారని, మనమే చిన్న చిన్న పొరపాట్లు చేశామని, ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలని కేటీఆర్ అన్నారు. కొంతమందిని కలుపుకొని పోయేది ఉండేదని, అయినప్పటికీ తక్కువ తేడాతోనే వికా రాబాద్ నియోజకవర్గంలో ఓడిపోయామన్నారు. వాస్తవంగా మాట్లాడాలంటే ఆనంద్ బ్రహ్మాండంగా పని చేశారని, రాజకీయాల్లో అనుభవం లేకపో యినా నిజాయితీపరుడని అన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు కలిసికట్టుగా పని చేసి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామని బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు నాగేందర్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఎన్.శుభప్ర దపటేల్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కు మార్, సీనియర్ నాయకుడు రామచం ద్రారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

### మాకు ఆత్మహత్యలే శరణ్యం..



కొన్నేండ్లుగా ఈ భూములను నమ్ము కునే జీవిస్తున్నాం. ఆ భూములే జీవ నాధారం. కానీ, ప్రభుత్వం తమకు తెలియకుండా భూములను లాక్కొని ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని చూడడం దారుణం. ఆ భూములు లేకుంటే మాకు ఆత్మహత్యలే శరణ్యం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పట్టా భూము లను మా పేర్లపై ఆన్‌లైన్‌లో మార్పించాలి.

– పార్వతమ్మ, నక్కర్త

### మా భూములను లాక్కోవద్దు..



మేడిపల్లిలో ఉన్న పట్టా భూమిని తమకు తెలియకుండా ప్రభుత్వం పేరు తో ఆన్‌లైన్‌లో మార్చిడి చేశారు. దీంతో ఆ భూములన్నీ ప్రస్తుతం నిషేధిత జాబితాలోకి వెళ్లాయి. తమ పట్టా భూములను బలవం తంగా లాక్కోవడం ఎంతవరకు సమంజసం. మా పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో రైతుబంధు, పంట రుణాలు రావ డంలేదు.

– మల్లయ్య, మేడిపల్లి



కలెక్టరేట్ ఎదుట చేస్తున్న ధర్నాలో ప్లకార్డులు చూపుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్న బాధిత రైతులు

# ఆంక్షలను అధిగమించి.. ఫార్మా రద్దుకు నినదించి..

**ట్రాక్టర్లపై కలెక్టరేట్‌కు వెళ్లిన ఫార్మా బాధిత రైతులు**

**యాచారం, ఇబ్రహీంపట్నంలో భారీ బందోబస్తు**

**పోలీసుల వలయాన్ని ఛేదించుకొని కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన**

*రైతులను మభ్యపెట్టి మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అన్నదాతలను అరిగోస పెడుతున్నది. ఫార్మాసిటీ పేరుతో రైతుల భూములను లాక్కొంటూ వారికి బతుకుదెరువు లేకుండా చేస్తున్నది. పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు అందజేసినా.. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను వేడుకున్నా.. ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫార్మాకు భూములిచ్చేది లేదని రైతులు తెగేసి చెబుతుండడంతో 600 మంది రైతులకు నోటీసులు జారీ చేసి వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది. దీంతో శనివారం ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వ ర్యంలో యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన ఫార్మా బాధితులు ట్రాక్టర్లు, ఆటోలలో కలెక్టరేట్‌కు చేరుకుని ప్రధాన గేటు ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా లింకు రోడ్ల ద్వారా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ప్రభుత్వం చేస్తున్న బలవంతపు భూసేకరణను అడ్డుకుంటామని అన్నదాతలు ముక్తకంఠంతో నినదించారు. ప్రభుత్వం వెంటనే తమ భూములను తిరిగి తమ పేర్లపై ఆన్‌లైన్‌లో ఎక్కించాలన్న నినాదాలు హోరెత్తాయి. ఎన్నికలకు ముందు ఒక మాట.. గద్దెనెక్కాక మరో మాట మాట్లాడుతూ రైతులకు రేవంత్ సర్కార్ అన్యాయం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన విధంగా నాలుగు గ్రామాలకు చెందిన సుమారు 2,200 ఎకరాల పట్టా భూములను తిరిగి రైతుల పేరిట మార్చాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవ డంతో కలెక్టర్ ఏవో సునీల్‌కు బాధిత రైతులు వినతిపత్రాన్ని అందజేశారు.*

*- రంగారెడ్డి, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ)/యాచారం*

4లో..



రైతులను అడ్డుకునేందుకు బారికేడ్లను ఏర్పాట్లు చేసిన పోలీసులు



ట్రాక్టర్లలో కలెక్టరేట్‌కు వెళ్తున్న ఫార్మా బాధిత రైతులు

సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలోని గిరిజనులను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు. పచ్చని పొలాల్లో ఫార్మా కంపెనీలు, ఇండస్ట్రియల్ కారిడార్ దౌర్జన్యంగా భూములను లాక్కొంటున్నారు. ఉన్న ఎకరం, రెండెకరాలను లాక్కొంటే మళ్లీ ముంబై, దుబాయ్ వలసపోవాల్సిన పరిస్థితి ఏర్పడనున్నదని వేడుకున్నా అధికారులు కనికరించ లేదు. ఇప్పటికే అసైన్డ్ భూముల సర్వే పూర్తి చేసిన అధికారులు.. శనివారం పోలీసుల పహారా నడుమ పట్టా భూములకు సంబంధించి సర్వే చేశారు. వందల మంది పోలీసుల బందో బస్తు నడుమ కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలోని హకీంపేటలో పట్టా భూముల సర్వే నిర్వహించారు. ఇప్పటికే కేసులు ఉన్నందున భయం భయంతో గడుపుతున్న దుద్యాల మండలం లగచెర్ల, పోలేపల్లి, హకీంపేట గ్రామాల రైతులు ఏమీ చేయలేని దుస్థితిలో కన్నీరు మున్నీరుగా విలపిస్తు న్నారు. గతంలో ఏ ప్రభుత్వం అయినా రైతులను ఒప్పించి భూ సేకరణ చేపడితే...కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బలవంతంగా భూములను లాక్కొంటూ రైతుల నోట్లో మట్టి కొడుతున్నది.

- కొడంగల్, ఫిబ్రవరి 8

# రైతులు లేకుండానే భూ సర్వే

**భారీ పోలీసు బందోబస్తు నడుమ రెవెన్యూ అధికారుల భూ సర్వే**

- భయం నీడలో పొలాల్లోకి రాని రైతులు
- మా భూములు ఇచ్చేది లేదని రైతుల ఆవేదన
- హకీంపేట గ్రామంలో 146 పట్టా భూముల్లో సర్వే



స్థానికులు లేకుండానే దుద్యాల మండలంలోని హకీంపేటలోని పంట పొలాల్లో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

దుద్యాల మండలంలో ప్రభుత్వం తలపెట్టిన ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు భూ సేకరణలో భాగంగా అధికారులు సర్వే పనులు ముమ్మరం చేశారు. శుక్రవారం వరకు పోలేపల్లి, లగచెర్ల, హకీంపేట గ్రామాల పరిధిలోని అసైన్డ్ భూముల సర్వే చేప ట్టారు. కాగా, శనివారం హకీంపేట గ్రామ పరిధిలోని 146 ఎకరాలకు సంబంధించి పట్టా భూముల్లో సర్వే చేశారు. దుద్యాల మండల తహసీల్దార్ కిషన్ ఆధ్వర్యంలో దాదాపు 300లకుపైగా పోలీసుల బందోబస్తు మధ్య సర్వే చేపట్టారు. గతంలో జరిగిన లగచెర్ల ఘటన భయంతో అందుబాటులో లేమని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మరికొంత మంది రైతులు కష్టపడి సంపాదించుకున్న భూములను ప్రభుత్వా నికి ఎందుకివ్వాలని, భూములు లాక్కుంటే ఏ విధంగా బతుకాలని ప్రశ్నిస్తున్నారు. ఏదీ ఏమైనప్పటికీ మా భూములు ఇచ్చే ప్రసక్తి లేదని తేల్చి చెబుతున్నారు. రెండు, మూడు ఎకరాల పొలం ఉన్న రైతుల పంటపొలాలే ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పా టుకు అనువుగా ఉంటాయా.. పెద్ద మొత్తంలో భూమి ఉన్న రైతుల నుంచి భూమిని తీసుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. హకీంపేట గ్రామ పరిధిలో మొత్తంగా 114 మంది రైతులకు సంబంధించి 146 ఎకరాల పట్టా భూముల సేకరణ చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు 20 మంది రైతులు 40 ఎకరా లను ప్రభుత్వానికి అందిస్తున్నట్లు అనుమతిని తెలుపడం జరిగిందని తహసీల్దార్ పేర్కొన్నారు. సమ్మతి తెలిపిన రైతుల భూములతో పాటు మిగతా భూముల్లో కూడా సర్వే చేపట్టి హద్దులు గుర్తిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



సర్వే చేసేందుకు వెళ్తున్న సర్వే సిబ్బంది, పోలీసులు



### సమాచారం ఇవ్వకుండానే భూ సర్వే..

ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సర్వే చేయడం సమంజసం కాదు. ఉన్న భూమిని ఇచ్చి మేం ఏం పని చేసి బతకాలె. మా భూమిలో పెద్దల సమాధులు ఉన్నాయి. జిల్లాల విభజనలో హకీంపేట నారాయణపేట జిల్లాలో ఉండేది. మళ్లీ గ్రామాన్ని వికారాబాద్ జిల్లాలో కలపడం బాధగా ఉన్నది.

– రాకం, కాదయ్య, అరుణ, హకీంపేట, దుద్యాల మండలం

### భూమి పోతే మాకు బతుకులేదు..

నాకు 3 ఎకరాల భూమి ఉన్నది. కష్టపడి పొలాన్ని సాగు చేసుకొంటున్నా. ప్రభుత్వం రైతులను ఆదుకునేది పోయి నిల్వ నీడలే కుండా చేస్తే ఎట్లా .. వ్యవసాయం అంటేనే మాకు ఇష్టం. మీరు పైసలు, ఉద్యోగం ఇస్తా మంటే ఏం చేసుకోవాలి. భూమి ఇస్తే రోడ్డు పాలు కావాలె. ఏం చేసినా మా భూమిని పోగొట్టుకునేందుకు సిద్ధంగా లేము.

– రాములు, హకీంపేట, దుద్యాల మండలం

